

## వెర్రెత్తించే ఎరుపు!

మగవాళ్ళను వెర్రెత్తించాలన్న ఆశ ఉన్న ఆడవాళ్ళు ఎరుపు దుస్తుల్ని ధరించడం మంచిదంటున్నారు అమెరికన్ పరిశోధకులు. మగవాళ్ళలో ఎరుపు రంగు శృంగార పరమైన కోరికల్ని కలిగిస్తుందని వారంటున్నారు. న్యూయార్క్‌లోని రోచెస్టర్ యునివర్శిటీ వారు వంద మందికి పైగా మగవాళ్ళపై ఈ పరిశోధన జరిపారు. ఈ వంద మందిలో చాలా మంది యువకులే. ఒకే అమ్మాయి ఫోటోను వేర్వేరు రంగులున్న ఫ్రేముల్లో బిగించి ఈ యువకులకు చూపించారు. వారిలో అందంగా ఎవరున్నారో చెప్పమన్నారు. అబ్బాయిల్లో అధిక శాతం ఎరుపు రంగు ఫ్రేము ఉన్న ఫోటోలోని అమ్మాయిల్ని ఎక్కువ ఇష్టపడ్డారు. పరిశోధన రెండో విడతగా ఈ ఫోటోల్లో అమ్మాయిల చొక్కాలను డిజిటల్ టెక్నాలజీ ద్వారా ఎరుపు, పసుపు, నీలం, ఆకు పచ్చ ఇలా వేర్వేరు రంగుల్లో మార్చారు. ఇప్పుడు వారిలో ఒక అమ్మాయితో



డిన్నర్ చేసే అవకాశం వస్తే ఎవర్ని ఎంచుకుంటారని అబ్బాయిల్ని అడిగారు. ఇపుడు కూడా అబ్బాయిల దృష్టి ఎరుపు రంగు చొక్కా తొడుక్కున్న అమ్మాయిల మీదకే పోయింది. ''వీరిలో ఎవరు అందంగా ఉన్నారు, ఎవర్ని ముద్దు పెట్టుకోవాలనుకుంటున్నారు, ఎవరితో శృంగారంలో పాల్గొనాలనుకుంటున్నారు?'' అన్న ప్రశ్నల్ని అడిగినపుడు అధిక శాతం మంది ఎరుపు రంగు చొక్కా తొడుక్కున్న అమ్మాయికే ఓటేశారట. ఈ పరిశోధన నిర్వహించిన ప్రొఫెసర్ ఆండ్రూ ఎలియట్ మాట్లాడుతూ, ''మగవాళ్ళలో ఈ లక్షణం పరిణామ క్రమంలోంచే వచ్చింది. ఉదాహరణకి చాలా లక్షణాల్లో మనుషులతో పోలి ఉండే బబూన్ కోతుల్లో కూడా ఈ లక్షణం ఉంది. ఆడ బబూన్ కోతుల శరీరం ప్రత్యుత్పత్తికి సిద్ధం కాగానే కాస్త ఎర్రగా మారుతుంది. ఈ ఎరుపుదనం మగ కోతుల్ని ఆకర్షిస్తుంది. అవి వాటి వెంటపడతాయి. కోతుల్లో ఎరుపుకు స్పందించే ఈ లక్షణమే పరిణామ క్రమంలో మనుషులకీ సంక్రమించి ఉంటుంది,'' అంటున్నాడు. అయితే, ఎరుపు రంగు ఆడవాళ్ళపై మాత్రం ఎలాంటి ప్రభావమూ చూపలేకపోయింది. ఇదే పరిశోధనలో భాగంగా అబ్బాయిలకు చూపించిన ఎరుపు రంగు దుస్తులేసుకున్న అమ్మాయిల ఫోటోల్నే కొందరు అమ్మాయిలకు కూడా చూపించారు. వారిలో ఎవరు అందంగా ఉన్నారో తేల్చి చెప్పమన్నారు. అమ్మాయిలు మాత్రం రంగుతో సంబంధం లేకుండా తమ నిర్ణయాన్ని ప్రకటించారట.

## 'సరసి' కత

వైశంపాయనుడు పెళ్ళయిన రోజుల్లో నిత్యం చదరంగం ఆడేవాడు. రెండు రోజులు ఏ కారణం చేతనైనా ఆ ఆట ఆడకపోతే పిచ్చెక్కినట్టుండేదతనికి.

పెళ్లిలో మధ్యాహ్నం పూట, రాత్రి శోభనం గదిలో కూడా చెస్ ఆడాలని ట్రై చేశాడు గానీ, తనకి చేత కాదని తప్పించుకుంది భార్య సుబ్బాయమ్మగారు.

మనుగుడుపులకి అత్తారూరు వెళ్లినప్పుడు–భోజనాల వేళ పెళ్లి కొడుక్కి పెద్ద వెండి కంచంలో రకరకాల కూరలు, పిండి వంటలూ వడ్డించారు. వడ్డన ఇంకా పూర్తి కాలేదు. ఈలోగానే, వైశంపాయనుడు కంచంలో చెయ్యి పెట్టి, కూరని పప్పు స్థానంలోకి జరిపి, పప్పుని అప్పడం దగ్గరికి తోశాడు. పులిహోరని పచ్చడి వైపుకి జరిపి,

### ఆటగాడు




పచ్చడిని తీసి కంచం బయట పడేశాడు. ఆ తర్వాత వొడియాన్ని తీసుకుని ఎక్కడ పెట్టాలా అని దీర్ఘాలోచనలో పడ్డాడు.

కొత్త పెళ్లి కొడుకు కాబట్టి సాధారణంగా ఆడపిల్ల తరపు వారంతా అతడి వైపు ఆసక్తిగా చూస్తూ వుండడం సహజం. వారందరికీ అతడి వెర్రి చేష్టలు చూసి మతులు పోయాయి. పొరబాటుగా–చిత్త చాంచల్యం వున్న వాడికిచ్చి పిల్ల గొంతుక్కోశానేమో నని పిల్ల తండ్రి తల్లడిల్లిపోయాడు.

''నాలుగు రోజులు చదరంగం ఆడకపోయేసరికి పాపం తేడా చేసింది!'' అంటూ సుబ్బాయమ్మగారు ప్రకాశంగా ఓ ప్రకటన చేసి, మొగుడికి గట్టిగా ఓ పిక్కపాయసం పెట్టింది, ఎవరూ చూడకుండా.

*